క్లుప్తంగా

అప్రమత్తతతోనే అగ్ని ప్రమాదాల నివారణ



అగ్నిప్రమాదాల నివారణపై మాక్ డ్రిల్ చేయిస్తున్న ఫైర్ సిబ్బంది

ఆలూరు రూరల్: అప్రమత్తతోనే అగ్ని ప్రమాదాల నుంచి ప్రాణాలు కాపాడుకోవచ్చని ఆలూరు అగ్నిమాపక అధికారి ఖాద్రి అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆలూరులోని ఓ ప్రైవేటు స్కూల్‌లో ప్రమాదాల నివారణపై మాక్ డ్రిల్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. చిన్నపిల్లలను మండే పరికరాలకు దూరంగా ఉంచాలన్నారు. ఇళ్లలో పాత కరెంటు వైర్లను తొలగించాలని సూచించారు. ఫైర్ సిబ్బంది ఉన్నారు.

ఎన్నికల వ్యయ అధికారి పరిశీలన



నామినేషన్ కేంద్రంలో అధికారులతో మాట్లాడుతున్న రాకేష్‌గదోడియా

ఎమ్మిగనూరురూరల్: స్థానిక నామినేషన్ కేంద్రాన్ని ఎన్నికల వ్యయ పరిశీలకులు రాకేష్‌గ డోడియా శుక్రవారం పరిశీలించారు. నామినేషన్ వేసిన వారి వివరాలను, వారి ఖర్చులను రిటర్నింగ్ అధికారి చిరంజీవిని అడిగి తెలుసుకున్నారు. ఎన్నికలకు సంబంధించి ఆయా పార్టీల అభ్యర్థుల ఖర్చుల వివరాలు పక్కాగా నమోదు కావాలని ఆయన అధికారులకు సూచించారు. వ్యయ వివరాలు రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. రిటర్నింగ్ అధికారి చిరంజీవి, తహసీల్దార్లు శేషారెడ్డి, భూపతిపార్వతి, ఓబులేసు, ఇతర అధికారులు తదితరులు ఉన్నారు.

విజేత వైఎస్సార్ జిల్లా వృషభాలు



నేమకల్లులో రాతి దూలం లాగుతున్న వృషభాలు

చిప్పగిరి: శ్రీరామనవమి సందర్భంగా శుక్రవారం నేమకల్లు గ్రామంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి వృషభాల రాతి దూలం లాగే పోటీల్లో వైఎస్సార్ జిల్లా వేంపల్లి మండలం గాజులపేటకు చెందిన పసుపులేటి రమణ వృషభాలు విజేతగా నిలిచాయి. శుక్రవారం ఉదయాన్నే ప్రారంభమైన పోటీల్లో 18 జతల వృషభాలు పాల్గొన్నాయి. విజేతగా వైఎస్సార్ జిల్లా వేంపల్లి వృషభాలు, తరువాతి స్థానాల్లో కర్నూలు జిల్లా జొన్నగిరి, అనంతపురం జిల్లా పేర్నిపాడుకు చెందిన వృషభాలు నిలిచాయి. విజేత వృషభాల యజమానులకు దాతలు బుసినె చంద్రశేఖర్ రూ.30 వేలు, ఎంపీపీ జూటూరు హేమలత రూ.25 వేలు, కుందనగుర్తి దివాకర్ రెడ్డి రూ.22,222 నగదు బహుమతులు అందించారు. సర్పంచ్ ప్రేమ్‌కుమార్, నాయకులు సత్తి రెడ్డి, సురేష్ రెడ్డి, సుంకన్న, భీమలింగ, గిరి తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్ బాబు డ్రామా



ఆలూరులో టీడీపీ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

ఆలూరు రూరల్: వాహన డ్రైవర్లను ప్రసన్నం చేసుకుని ఓట్లు పొందేందుకు టీడీపీ అధినేత చంద్రబాబు కొత్త డ్రామాకు తెరలేపారు. వైఎస్సార్‌సీపీ అధినేత, సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సామాన్యులు సైతం రాజకీయాల్లో రాణించాలనే ఉద్దేశంతో అనంతపురం జిల్లా శింగనమల నియోజకవర్గానికి చెందిన టిప్పర్ డ్రైవర్ వీరాంజనేయులుకు ఎమ్మెల్యే టికెట్ కేటాయిస్తే ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు హేళనగా మాట్లాడి డ్రైవర్ల ఆగ్రహానికి గురైన సంగతి తెలిసిందే. ఇప్పుడు డ్రైవర్లంటే తమకు ఎంతో గౌరవం ఉన్నట్లుగా ఆలూరులో శుక్రవారం నిర్వహించిన ప్రచార సభలో 'ఏపీకి డ్రైవర్ బాబు' అనే రీతిలో పోస్టర్ ప్రదర్శించడం చర్చనీయాంశంగా మారింది.

నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి మండలంలో శుక్రవారం సాయంత్రం అకస్మాత్తుగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకుని ఉరుములు, మెరుపులతో హోరుగాలి రేగింది. పిడుగుల శబ్దానికి కలుగొట్ల గ్రామానికి చెందిన కోటకొండ బజారి ఇంటిముందు కల్లంలో కట్టి ఉంచిన కాడెద్దులలో ఒకటి మరణించింది. రూ.80 వేల నష్టంతో పాటు వ్యవసాయానికి చేదోడు లేకుండాపోయిందని రైతు వాపోయాడు. గాలివానకు బోయనపల్లె, బ్రహ్మగుండం పరిసరాల్లో విద్యుత్ స్తంభాలు నేలకొరిగినట్లు ఏఈ రాఘవేంద్ర ప్రసాద్ తెలిపారు. వెల్దుర్తి నుంచి రామళ్లకోట విద్యుత్ సబ్‌స్టేషన్‌కు సరఫరా నిలిచిపోవడంతో ఆ పరిధిలోని గ్రామాలు అంధకారమయ్యాయి. సిబ్బంది విద్యుత్ సరఫరా పునరుద్ధరించే పనిలో పడ్డారు.

ఆదరిస్తే మరింత అభివృద్ధి చేస్తాం

- ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి
- పత్తికొండలో అట్టహాసంగా నామినేషన్ దాఖలు
- వేలాదిగా తరలివచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలు
- భారీ ర్యాలీ, కిక్కిరిసిన పట్టణ వీధులు
- రెపరెపలాడిన వైఎస్సార్‌సీపీ జెండాలు





నామినేషన్ వేసేందుకు వెళ్తూ అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, పక్కన ఎంపీ అభ్యర్థి బీవై రామయ్య, ర్యాలీలో వైఎస్సార్‌సీపీ జెండాలతో పార్టీ శ్రేణుల సందడి

పత్తికొండటౌన్: ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాం, ప్రజలంతా నిండు మనసుతో ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం పత్తికొండలో ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి ర్యాలీగా వచ్చి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. నియోజకవర్గంలోని 5 మండలాల నుంచి వేలాదిగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు నామినేషన్ కార్యక్రమానికి తరలివచ్చారు. ర్యాలీలో వైఎస్సార్‌సీపీ జెండాలు రెపరెపలాడాయి. స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహం నుంచి ఓపెన్‌టాప్ వాహనంపై కంగాటి శ్రీదేవి, కర్నూలు ఎంపీ అభ్యర్థి బీవై రామయ్య పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి ర్యాలీగా ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకుసాగారు. చక్రాళ్లరోడ్డు సర్కిల్, వడ్డేకట్టవీధి, బొగ్గులచావిడి, తేరుబజారు, ఉప్పరకట్ట, పోస్టాఫీసు, ఎంపీడీఓ కార్యాయం మీదుగా గుత్తిరోడ్డు సర్కిల్ వరకు ర్యాలీ సాగింది. డీజేలు, డ్రమ్స్ వాయిద్యాలు, తప్పెట్ల దరువు మధ్య డాన్సులు వేస్తూ పార్టీ కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. పెద్ద ఎత్తున మహిళలు హాజరయ్యారు.ర్యాలీ అనంతరం ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ఆర్డీఓ కార్యాలయానికి చేరుకుని ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు. ఎన్నికల ఆర్ఓ, ఆర్డీఓ నీలపు రామలక్ష్మికి నామినేషన్ పత్రాలు అందజేశారు. ఎంపీ అభ్యర్థి బీవై రామయ్య, పార్టీ నాయకులు నాగరత్నమ్మ, చెరుకులపాడు ప్రదీప్‌రెడ్డి వెంట ఉన్నారు. ఎమ్మెల్యే తనయుడు కంగాటి రామ్మోహన్ రెడ్డి మరో సెట్ నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ వేసిన అనంతరం ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి విలేకరులతో మాట్లాడుతూ.. గత ఎన్నికలలో ప్రజలకు హామీలన్నీ నెరవేర్చిన ఘనత సీఎం జగనన్నకు దక్కిందన్నారు. మేనిఫెస్టోలోని 99 శాతం హామీలు నెరవేర్చామని అందుకే ప్రజల వద్దకు ధైర్యంగా వెళ్లి మళ్లీ ఓట్లు అడుగుతున్నామన్నారు. నియోజకవర్గంలో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండటంతో పాటు పార్టీలకు, కులాలకు, మతాలకు, వర్గాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయఢంకా మోగిస్తుందని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం అయి ప్రజారంజక పాలన కొనసాగిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఎంపీ అభ్యర్థి బీవై రామయ్య మాట్లాడుతూ.. సామాజిక న్యాయం చేతల్లో చూసిన నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. రాజకీయంగా అన్ని వర్గాలకు సముచిత ప్రాధాన్యత కల్పించారన్నారు. ఎన్నికల్లో ప్రజలంతా ఆలోచించి ఓటు వేయాలని, అభివృద్ధి, సంక్షేమం నిరంతరాయంగా కొనసాగాలంటే వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల తర్వాత ప్రతిపక్ష పార్టీలన్నీ గల్లంతవుతాయని జోస్యం చెప్పారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రదీప్‌రెడ్డి, ఎస్.రామచంద్రారెడ్డి, సత్యనారాయణమ్మ, వెన్నపూస రవీంద్రారెడ్డి, పక్కీరప్ప, ఉరుకుందమ్మ, పులికొండనాయక్, మురళీధర్‌రెడ్డి, రవిరెడ్డి, నారాయణదాసు, శ్రీరంగడు, సోమశేఖర్, భాస్కర్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీ జెండాతో చిన్నారి



నామినేషన్ ర్యాలీలో డోలు వాయిస్తున్న కళాకారులు

ఆలూరులో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి విరూపాక్షి నామినేషన్



ఆర్ఓకు నామినేషన్ పత్రాలను అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుసినె విరుపాక్షి

ఆలూరు: ఆలూరు అసెంబ్లీ స్థానానికి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుసినె విరూపాక్షి ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు. ఈ మేరకు శుక్రవారం ఎన్నికల ఆర్ఓ డి.రామునాయక్‌కు నామినేషన్ పత్రాలను అందజేశారు. జెడ్పీటీసీ సభ్యుడు ఏరూరుశేఖర్, వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా సంఘం నాయకురాలు శశికళ, పార్టీ లీగల్ సెల్ సభ్యుడు లక్ష్మీకాంత్ వెంట ఉన్నారు. అనంతరం విరూపాక్షి విలేకరులతో మాట్లాడారు. ఈనెల 23వ తేదీన అన్ని మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి ర్యాలీ నిర్వహించి మరో సెట్ నామినేషన్ దాఖలు చేయనున్నట్లు చెప్పారు. పార్టీ శ్రేణులు తరలిరావాలని కోరారు.

పత్తికొండలో 4 నామినేషన్ల దాఖలు

పత్తికొండటౌన్: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా పత్తికొండ అసెంబ్లీ స్థానానికి రెండవ రోజు శుక్రవారం 4 నామినేషన్లు దాఖలైయినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి, ఆర్డీఓ నీలపు రామలక్ష్మి తెలిపారు. వైఎస్సార్‌సీపీ తరపున ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ఒక సెట్ నామినేషన్ దాఖలు చేయగా, ఆమె తనయుడు కంగాటి రామ్‌మోహన్‌రెడ్డి మరో సెట్ నామినేషన్ దాఖలు చేశారు. ఇండియా కూటమి తరపున పోటీ చేస్తున్న ఏపీ రైతు సంఘం (సీపీఐ) రాష్ట్ర కార్యదర్శి పి.రామచంద్రయ్య, టీడీపీ తరపున కేఈ శ్యాంకుమార్ నామినేషన్లు దాఖలు చేశారు.

వైఎస్సార్‌సీపీ విజయానికి సహకరించండి



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక



ఎమ్మిగనూరు 15వ వార్డులో ఇంటింటి ప్రచారం చేస్తున్న బుట్టా రేణుక

నందవరం: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎంతో నమ్మకంతో తనను ఎమ్మిగనూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో నిలిపారు. గ్రామ సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తన గెలుపు కోసం సహకారించాలని బుట్టా రేణుక విన్నవించారు. ఆమె శుక్రవారం నందవరంలో పార్టీ శ్రేణులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. ఈ వ్యవస్థ ద్వారా పేదలకు ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందాయని గుర్తుచేశారు. గతంలో టీడీపీ హయాంలో సంక్షేమ పథకాలు అందాలంటే జన్మభూమి కమిటీలకు లంచాలు ఇవ్వాల్సి వచ్చేదన్నారు. ప్రస్తుతం లంచాలకు తావు లేకుండా అర్హతే ప్రమాణికంగా కుల, మత, వర్గాలు, రాజకీయాలు, పార్టీలకు అతీతంగా ప్రతిఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందన్నారు. సార్వత్రిక ఎన్నికలో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి, వేయించి సంక్షేమ ప్రభుత్వాన్ని నిలబెట్టుకునేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు

నవరత్నాలతో పేదల ఇంట వెలుగులు
: ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి

వైఎస్ జగనన్న నవవరత్నాల పథకాలతో పేదల ఇంట సంక్షేమ వెలుగులు నింపారని పార్టీ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజలు చంద్రబాబును నమ్మే ప్రసక్తే లేదన్నారు. అబద్దపు హామీలతో 14 ఏళ్లు సీఎంగా పబ్బం గడిపిన చంద్రబాబు చేతిలో మోసపోయేందుకు ప్రజలు సిద్ధంగా లేరని, టీడీపీ కుట్రలను గమనిస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలని ఉద్ఘాటించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీకాంతరెడ్డి, మండల కన్వీనర్ శివారెడ్డిగౌడ్, నాయకులు విరుపాక్షిరెడ్డి, చాంద్‌బాషా, పేట శ్రీనివాసరెడ్డి, నిఖిల్ చక్రవర్తి, వెంకటేశ్వరరెడ్డి, రామకోటేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి

ఎమ్మిగనూరుటౌన్: పేదల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగనన్న అమలుచేసిన సంక్షేమ పథకాలే మరోసారి వైఎస్‌ఆర్‌సీపీ గెలుపునకు నాంది కానున్నాయని, సంక్షేమ పథకాలు పొందిన ప్రతి కుటుంబం ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసేందుకు సిద్ధంగా ఉందని ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టారేణుక ధీమా వ్యక్తం చేశారు. ఆమె శుక్రవారం పట్టణంలోని 15వ వార్డులో వీరశైవ లింగాయత్, కుర్ని కరికల కార్పొరేషన్ చైర్మన్లు రుద్రగౌడ్, బుట్టా శారదమ్మ, కౌన్సిలర్ ఇషాక్, పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్సార్‌సీపీకి మద్దతు ఇచ్చి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని ఓటర్లను కోరారు. అవినీతిమయమైన టీడీపీ అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలు ఉండవని, ఆ పార్టీ వారు చెప్పే కల్లబొల్లి మాటలు విని మోసపోవద్దని సూచించారు. ఎన్నికల్లో టీడీపీకి తగిన గుణపాఠం చెప్పాలని సంక్షేమ సారథి సీఎం వైఎస్ జగనన్నకు మరోసారి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. జిల్లా వక్ఫ్‌బోర్డ్ ఉపాధ్యక్షులు రియాజ్‌అహమ్మద్, వైఎస్సార్‌సీపీ నాయకులు రహంతుల్లా, ఖిబులాహుసేన్, సునీల్‌కుమార్, వాహిద్, అమాన్, రాజారత్నం, సుధాకర్, కేశవరెడ్డి, అబ్రార్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిక

ఎమ్మిగనూరుటౌన్: మండల పరిధిలోని గుడికల్ గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు శుక్రవారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక సమక్షంలో ఆ పార్టీలో చేరారు. నాయకులు సుశీలయ్య, బోయ నల్లన్న, నడవలయ్య, గోపాల్, రాముడు, గోవిందు, నీలకంఠ, ఆంజినేయులు, ఆనందు, గుంటెప్ప, ఈరన్న, వీరన్నతో పాటు మరో వంద మంది వైఎస్సార్‌సీపీలో చేరగా ఆమెతో పాటు బుట్టా శివనీలకంఠ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అదేవిధంగా గోనెగండ్ల మండలం గంజిహళ్లికి చెందిన అంపయ్య, చిన్న హనుమంతు, అరవ బొడ్డన్న, చిరంజీవి,తిమ్మప్ప, దేవేంద్ర, ఉరుకుందుతో పాటు మరో వంద మంది వైఎస్సార్‌సీపీలో చేరారు.

జవహార్ నవోదయలో ప్రేరణ ఉత్సవాలు

ఎమ్మిగనూరురూరల్: బనవాసి జవహార్ నవోదయ విద్యాలయంలో జిల్లా స్థాయి ప్రేరణ ఉత్సవాలు శుక్రవారం ప్రారంభయ్యాయి. ఈ సందర్భంగా నోడ్ అధికారి, విద్యాలయ ప్రిన్సిపాల్ ఇ.పద్మావతి మాట్లాడుతూ.. ప్రేరణ ఉత్సవాలకు జిల్లాలోని 66 పాఠశాలల నుంచి 52 మంది బాలురు, 66 మంది బాలికలు పాల్గొన్నట్లు చెప్పారు. విద్యార్థులకు మూడు విభాగాల్లో (డ్రాయింగ్, వ్యాసరచన, పద్యభాగం) పోటీలు నిర్వహించి 30 మందిని రెండవ రౌండ్‌కు ఎంపిక చేసినట్లు తెలిపారు. వారి మార్కులను ప్రేరణ పోర్టల్‌లో అప్‌లోడ్ చేసినట్లు తెలిపారు.

ప్రేరణ ఉత్సవ్‌కు ఇద్దరి ఎంపిక

మద్దికెర: ప్రేరణ ఉత్సవ్‌కు మద్దికెరకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. బనవాసిలోని నవోదయ విద్యాలయంలో 150 మంది విద్యార్థులకు ప్రేరణ పోటీలు నిర్వహించగా జడ్పీ బాలుర పాఠశాల విద్యార్థి పవన్, మోడల్ స్కూల్ విద్యార్థి విష్ణు ఎంపికైనట్లు చెప్పారు. ఎంపికైన విద్యార్థులకు గుజరాత్‌లోని వాడ్‌నగర్‌లో సాంకేతికత, ప్రయోగాత్మక విద్యపై వారం రోజుల శిక్షణ ఉంటుందని తెలిపారు.

గర్భిణి ఆత్మహత్యాయత్నం

తుగ్గలి: మండల పరిధిలోని జీ.ఎర్రగుడికి చెందిన మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గ్రామానికి చెందిన మహాలక్ష్మి (20)కి అదే గ్రామానికి చెందిన మహేష్‌తో ఆరునెలల క్రితం వివాహం జరిగింది. గర్భిణి అయిన మహాలక్ష్మి శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుంది. మంటలు తాళలేక కేకలు వేయడంతో భర్త వెళ్లి ఆర్పే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో ఆయనకు కూడా గాయాలయ్యాయి. బాధితురాలిని చికిత్స నిమిత్తం గుత్తి ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో కర్నూలుకు తరలించారు. ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలియాల్సి ఉంది.

వాహనాల తనిఖీ

మద్దికెర: వాహనదారులు నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని ఎస్ఐ రమేష్‌బాబు హెచ్చరించారు. శుక్రవారం మద్దికెర గ్రామ శివార్లలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ఎన్నికల నిబంధనల మేరకు నడుచుకోవాలన్నారు. వాహనాలలో డబ్బు, ఇతర నిషేధిత సామగ్రి తరలిస్తే సీజ్ చేస్తామని హెచ్చరించారు. డ్రైవర్లు వాహన రికార్డులను వెంట ఉంచుకోవాలన్నారు. ఆటోలలో కెపాసిటీకి మించి ప్రయాణికులను తరలించవద్దని సూచించారు.

అవి-ఇవి

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి


తుగ్గలి: మండల పరిధిలోని ఎద్దులదొడ్డి వైఎస్సార్‌సీపీ నాయకుడు రాజశేఖర రెడ్డి (52) అనారోగ్యంతో మృతి చెందారు. గత కొంత కాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. నాలుగు రోజుల క్రితం తీవ్ర అస్వస్థతకు గురికావడంతో చికిత్స నిమిత్తం ఆయన్ను కుటుంబ సభ్యులు కర్నూలుకు తరలించారు. అక్కడ ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక శుక్రవారం మృతి చెందారు. ఆయనకు కూతురు, కుమారుడు ఉన్నారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు రాజశేఖరరెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.


ప్రత్యేక హోదా తీసుకొస్తాం

ఎమ్మిగనూరు రూరల్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రానికి 10 సంవత్సరాలు ప్రత్యేక హోదా తెస్తామని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు షర్మిల హామీ ఇచ్చారు. శుక్రవారం రాత్రి పట్టణంలోని గాంధీ సర్కిల్‌లో బస్సుయాత్రలో భాగంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ కర్నూలు పార్లమెంటరీ అభ్యర్థి పిజి.రాంపుల్లయ్యయాదవ్‌కు ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. ఇదిలాఉంటే కాంగ్రెస్ పార్టీ బస్సు యాత్ర లో ఎమ్మిగనూరు ఎమ్మెల్యే అభ్యర్థిని ప్రకటించకపోవడం గమనార్హం. ఎమ్మెల్యే అభ్యర్థి ఎవరో తెలియనప్పుడు ఈ యాత్రల వల్ల ఉపయోగం ఎమి ఉంటుందని ప్రజలు చర్చించుకున్నారు.

ఆలూరు: విభజన చట్టంలోని హామీలు, ప్రత్యేక హోదా ఇవ్వకుండా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిందని ఏపీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు షర్మిల ఆరోపించారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో ఏపీ న్యాయ బస్సు యాత్ర సభలో షర్మిల ప్రసంగించారు. ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న బీజేపీకి ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బాబురావు పాల్గొన్నారు.

సంక్షేమాభివృద్ధికి పట్టం కట్టండి





పచ్చారపల్లిలో ప్రజలకు అభివాదం చేస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బి.విరూపాక్షి, వైఎస్సార్‌సీపీలో చేరిన హొళగుంద టీడీపీ నాయకులతో విరూపాక్షి

హాలహర్వి: రాష్ట్ర ప్రజలు మరోసారి సంక్షేమాభివృద్ధికి పట్టం కట్టాలని వైఎస్సార్‌సీపీ ఆలూరు ఎమ్మెల్యే అభ్యర్థి బి.విరూపాక్షి పిలుపునిచ్చారు. ఆయన శుక్రవారం మండలంలోని జె.హొసళ్లి, బాపురం, అర్ధగేరి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా విరూపాక్షి మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేనివిధంగా గ్రామస్థాయిలో సచివాలయాలను ఏర్పాటు చేసి ప్రభుత్వ పాలనను గ్రామస్థాయికి చేర్చిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. జగనన్న పాలనలో ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లుతున్నారని చెప్పారు. ఐదేళ్ల పాలనలో పేద కుటుంబాలకు రూ.3 లక్షల వరకు లబ్ధి చేకూర్చరని వివరించారు. గతంలో చంద్రబాబునాయుడు 600 హామీలిచ్చి రాష్ట్ర ప్రజలను మోసగిస్తే, సీఎం జగనన్న హామీలన్నీ నెరవేర్చి ప్రజలకు నేనున్నాననే భరోసా కల్పించాడన్నారు. సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని విన్నవించారు. పార్టీ జిల్లా మహిళా అధ్యక్షులు శశికళ కృష్ణమోహన్, మండల కన్వీనర్ పచ్చారపల్లి రామిరెడ్డి, నాయకులు జనార్ధన్‌నాయుడు, నెట్టికంటమ్మ, నగేష్, రాఘవేంద్రరెడ్డి, అర్జున్‌రెడ్డి, రంజిత్, అర్జున్, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

- మండలంలోని బాపురం గ్రామంలో శుక్రవారం రాత్రి 15 కుటుంబాల వారు బీజేపీని వీడి ఎమ్మెల్యే అభ్యర్థి విరూపాక్షి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో పార్టీలోకి చేరారు. మహిళా నాయకురాలు శశికళ కృష్ణమోహన్ సమక్షంలో వారు పార్టీలో చేరగా కండువాలు వేసి ఆహ్వానించారు.

వలంటీర్లపై వెకిలి మాటలు మరిచావా బాబూ?

హొళగుంద: ఎన్నికలు సమీపిస్తుండడంతో జగనన్న పథకాలకు పేరు మార్చి ప్రజలను మభ్యపెట్టేందుకు చంద్రబాబు కుట్రలు చేస్తున్నారని, అలాంటి వారిని నమ్మితే భవిష్యత్తు అంధకారం అవుతుందని వైఎస్సార్‌సీపీ ఆలూరు ఎమ్మెల్యే అభ్యర్థి బుసినె విరూపాక్షి అన్నారు. ఆయన శుక్రవారం బళ్లారి మాజీ డిప్యూటీ మేయర్ శశికళతో కలిసి హొళగుందతో పాటు వందవాగిలి గ్రామంలో పర్యటించగా టీడీపీ, ఇతర పార్టీల నుంచి పలువురు నాయకులు వారి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. విరుపాక్షి మాట్లాడుతూ.. ఎన్నికల ముందు వందల్లో హామీలిచ్చి తర్వాత మోసగించడం చంద్రబాబుకు అలవాటేనన్నారు. వలంటీర్ల సేవలపై ఐదేళ్లుగా విషం కక్కుతూ వెకిలి మాటలు, నిందలతో దూషించిన చంద్రబాబు ఇప్పుడు ఎన్నికల సమయం కావడంతో వలంటీర్లకు రూ.10వేలు వేతనం ఇస్తామంటూ కొత్త నాటకానికి తెరతీశారన్నారు. అబద్ధం, మోసం చంద్రబాబుకు తోబుట్టువులని విమర్శించారు. 2024 ఎన్నికల్లో ఫ్యాన్ ప్రభంజనం ఖాయమని, ఇది ప్రతిపక్షాలకు స్పష్టంగా అర్థం కావడంతో తట్టుకోలేక జగనన్నపై హత్యాయత్నానికి ఒడిగట్టారని ఆరోపించారు. గత టీడీపీ, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనలో తేడాను ప్రజలు గుర్తించి ఓటేయాలని కోరారు. గ్రామంలో ఏ సమస్య వచ్చినా తనను కలిస్తే పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు.

ఖాళీ అవుతున్న టీడీపీ

హొళగుంద: హొళగుంద, వందవాగిలి గ్రామాలలో ఎన్నో ఏళ్లుగా టీడీపీని అట్టిపెట్టుకున్న కార్యకర్తలు దాదాపు 150 కుటుంబాల వారు శుక్రవారం ఎమ్మెల్యే అభ్యర్థి బుసినె విరూపాక్షి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. అలాగే బీసీ కాలనీలో 120 దూదేకుల కుటుంబాలు, వందవాగిలిలో శేషగిరి ఆధ్వర్యంలో 150 టీడీపీ మద్దతు కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. వారికి విరుపాక్షి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ప్రతి ఇంటికీ మేలు చేసిన జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవడానికి సైనికుల్లా కష్టపడాలని పిలుపునిచ్చారు.

టీడీపీకి బిగ్ షాక్

ఆలూరు రూరల్: ఆలూరులో శుక్రవారం టీడీపీ అధినేత చంద్రబాబు సభ జరుగుతుండగా మరో పక్క ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వీరభద్ర గౌడ్ సామాజిక వర్గమైన లింగాయతీ కులస్తులు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. హత్తిబెళగల్‌లో టీడీపీకి చెందిన జంగం శివకుమార్ స్వామి, చంద్రశేఖర్ గౌడ్, ప్రకాష్ గౌడ్, ప్రభాకర్ గౌడ్, వీరేంద్ర గౌడ్, నేత్ర దేవితో పాటు 70 కుటుంబాల వారు వైఎస్సార్‌సీపీలో చేరారు. విరూపాక్షి మాట్లాడుతూ.. నియోజకవర్గంలో రోజురోజుకు వైఎస్సార్‌సీపీ బలం పెరుగుతుందని, అందరి మద్దతుతో విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

జగనన్నతోనే సంక్షేమ బావుటా

నందవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే ఐదేళ్ల పాలనలో ప్రతిఇంటికీ సంక్షేమ పథకాలు అందించారని వైఎస్సార్‌సీపీ నాయకులు బుట్టా ప్రతుల్ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఇబ్రహీంపురం, కొట్టాల గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఆయన మాట్లాడుతూ.. పేదల సంక్షేమమే ప్రధాన అజెండాగా సీఎం జగనన్న పాలన సాగించారని ఉద్ఘాటించారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్సార్‌సీపీకి ఓటు వేయలని కోరారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక, ఎంపీ అభ్యర్థి బీవై రామయ్యను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. మండల కన్వీనర్ శివారెడ్డిగౌడ్, నాయకులు విరూపాక్షిరెడ్డి, పేట శ్రీనివాసరెడ్డి, చాంద్‌బాషా, నాగేశ్వరరెడ్డి, శకరప్ప తదితరులు పాల్గొన్నారు.



ఇబ్రహీంపురంలో ప్రచారం చేస్తున్న బుట్టా ప్రతుల్

గోనెగండ్ల: స్థానిక సంతమార్కెట్‌లోని పెద్ద మసీదు, కరీం మసీదులలో శుక్రవారం ప్రత్యేక నమాజ్ అనంతరం బయటకు వచ్చిన ముస్లింలను వైఎస్సార్‌సీపీ నాయకుడు ప్రతుల్ కలిసి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఆయన మాట్లాడుతూ.. ముస్లింల అభ్యున్నతి వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమవుతుందన్నారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమాన్ని చేరువ చేసి పేదలకు మంచి చేసిన ప్రభుత్వాన్ని ఆదరించాలని కోరారు. యూత్ అధ్యక్షుడు బందెనవాజ్, నాయకులు మబువలి, చికెన్‌రాజా, రఫీ, పెయింటర్ రహిమాన్, నదిముల్లా, ఉసేన్ వలి, బడేసావలి తదితరులు పాల్గొన్నారు.

21న ప్రవేశపరీక్ష

ఆస్పరి: మండలంలోని పుటకలమర్రి గ్రామం వద్ద ఉన్న మోడల్ స్కూల్లో 6వ తరగతి ప్రవేశానికి విద్యార్థులకు ఈనెల 21వ తేదీన పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ షమీల తెలిపారు. ఆమె శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 21వ తేదీన ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తామన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు హాల్ టికెట్లు తప్పకుండా తీసుకురావాలన్నారు.